సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 21 । మార్చి । 2025



పర్యావరణ స్పృహ పెంచేలా..
జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు యూత్ ఎకో క్లబ్‌లకు నిధులు విడుదలయ్యాయి. IIలో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.26
సహర్ (శనివారం ఉ॥) 4.55

వాతావరణం
గరిష్టం / కనిష్టం 37° / 22°
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అర్చన, నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేద పడింతులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డుకు 170 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో గురువారం నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డుకు 170 మంది కార్మికులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఆస్పత్రిలో గురు, శుక్రవారాల్లో మెడికల్ బోర్డు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలిరోజు 199 మందికి గాను 29 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అధికారులు.. రిపోర్ట్ ఆధారంగా శుక్రవారం అన్‌ఫిట్ చేస్తారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగియగా, ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారంతో పరిసమాప్తమయ్యాయి. చివరిరోజు ద్వితీయ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి 8,115 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 7,915 మంది మాత్రమే పరీక్ష రాశారని, 200 మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

బ్రహ్మోత్సవాల అంకురార్పణ జాప్యంపై విచారణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల అంకురార్పణ ఈనెల 13వ తేదీన ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అడిషనల్ కలెక్టర్ కృష్ణవేణి గురువారం రంగనాయకుల గుట్టపై గల కాటేజీలో విచారణ చేపట్టారు. అర్చకులు, ఈఓను పిలిచి ఆరా తీశారు. ప్రధానార్చకులు విజయరాఘవన్, కోటి రామస్వరూప్, స్థానాచార్యులు స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాస రామానుజాచార్యులను విడివిడిగా విచారించారు. ఈ వేడుకలకు బ్రహ్మగా వ్యవహరించాల్సిన ఓ అర్చకుడిని పర్ణశాలకు పంపించారని, ఆయన ప్రాముఖ్యతను ముందుగానే లిఖితపూర్వకంగా ఈఓ దృష్టికి తెచ్చామని అర్చకులు వివరించినట్లు తెలుస్తోంది. ఈఓ వ్యవహారశైలితోనే ఆలస్యమైందని వారు చెప్పినట్టు సమాచారం. ఆ తర్వాత విచారణకు ఈఓ రమాదేవిని పిలవగా ఆమె తన వాదన చెప్పారని తెలిసింది. టెంపుల్ స్పెషల్ ప్రొటెక్షన్ వారు నిర్వహించిన తనిఖీలు, దీనిపై ఏఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగానే అర్చకుడిపై డిప్యూటేషన్ చర్యలు తీసుకున్నామని, పాలనాపరమైన నిర్ణయాలు, నిబంధనల ప్రకారమే వ్యవహరించామని పేర్కొన్నట్లు సమాచారం. కాగా, ఇరు వర్గాల వాదనలపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు కృష్ణవేణి వెల్లడించారు. విచారణలో వరంగల్ డీసీ సంధ్యారాణి, హైదరాబాద్ డీసీ కృష్ణప్రసాద్, ఖమ్మం ఏసీ వీరస్వామి పాల్గొన్నారు. కాగా, కృష్ణవేణిని శ్రీరామనవమి ఉత్సవాల ప్రత్యేకాధికారిగా నియమించినట్లు సమాచారం. అయితే ఈ విషయమై అధికారులు ప్రకటన చేయాల్సి ఉంది.



తలసరిలో ఓకే!

జిల్లాలో సగటు ఆదాయం రూ.3,21,281
- ఎనీమియా ముక్త్ భారత్‌లో భేష్
- ఉపాధి హామీలోనూ సత్ఫలితాలు
- అడవుల విస్తీర్ణంలో రాష్ట్రంలో రెండో స్థానం
- సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ – 2025లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 2025 – 26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ వెంటనే తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్‌ను విడుదల చేసింది. ఇందులో స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం వంటి అంశాల్లో రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లా కొద్ది తేడాతోనే వెనుకంజలో ఉన్నట్టు తేలింది. 2024 – 25లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,46,457 (ప్రస్తుత ధరలు) ఉండగా, స్థిర ధరల ప్రకారం రూ.1.77లక్షలుగా ఉంది. ఈ విషయంలో జిల్లా తలసరి ఆదాయం వరుసగా రూ.3,21,281, రూ.1,73,951గా ఉంది. జిల్లా విస్తీర్ణంలో 44 శాతం అడవులే విస్తరించి ఉన్నప్పటికీ ఇక్కడున్న పరిశ్రమల కారణంగానే రాష్ట్ర తలసరి ఆదాయంతో జిల్లా పోటీ పడగలుతోంది. ఈ నివేదికలో వెల్లడించిన మరికొన్ని ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి..

రక్తహీనత అరికట్టే దిశగా..
పునరుత్పత్తి దశలో ఉన్న మహిళల్లో రక్త హీనత (ఎనీమియా) సమస్య దేశవ్యాప్తంగా ఉంది. దీని కోసం 2018లో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టింది. స్త్రీలలో రక్తహీనత తగ్గించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ట్యాబెట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ విషయంలో 80 శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించిన జిల్లాలు రాష్ట్ర స్థాయిలో 12 ఉండగా భద్రాద్రి జిల్లా 87.80 శాతంతో నాలుగో స్థానంలో నిలిచింది.

41శాతం అడవులే..
ఒక దేశం, రాష్ట్రం లేదా జిల్లా విస్తీర్ణంలో 30 శాతం అడవులు ఉండాలనే నియమాన్ని ప్రపంచ వ్యాప్తంగా పాటించేందుకు కృషి జరుగుతోంది. మన దగ్గర హరితహారం, వనమహోత్సవం పేరుతో ప్రతీ ఏటా మొక్కలు నాటుతున్నారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లోనే 30 శాతం.. అంతకు మించిన విస్తీర్ణంలో అడవులు ఉండగా భద్రాద్రి జిల్లా 41.38 శాతం అడవులతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ములుగు జిల్లా ఉంది. జిల్లా మొత్తం విస్తీర్ణం, అందులో అడవులను తీసుకుంటే ఇప్పటికీ వనాల విషయంలో భద్రాద్రి బెస్ట్ అనే పరిస్థితి ఉంది.

'ఉపాధి' ఇంకా కావాలి..
ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన వారికి పని దినాలు కల్పించడంలో జిల్లా 87.50 శాతం ఫలితాలు సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఇది 89 శాతంగా ఉంది. ప్రస్తుతం మునగ సాగు, చేపల చెరువు, వెదురు పెంపకం చేపట్టే చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు ఉపాధి హామీ వర్తింపజేసేలా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పనితీరులో జిల్లా ముందు వరుసలోకి వెళ్లే అవకాశముంది.

ఇతర వివరాలిలా..
- ఖనిజ సంపద ద్వారా ఆదాయాన్ని అందించడంలో జిల్లా మెరుగైన పనితీరునే కనబరుస్తోంది. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా నుంచి రూ.44 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ణయించగా రూ.42.49 కోట్ల ఆదాయం సాధించింది.
- వాణిజ్య ఎగుమతుల్లో దూసుకుపోతున్న జిల్లాల జాబితాలో మనకు చోటుదక్కలేదు.
- జిల్లాలో ఉన్న మొత్తం విద్యుత్ కనెక్షన్లలో 76.50 శాతం గృహ, 12 శాతం వ్యవసాయ, 0.5 శాతం పరిశ్రమలు, ఇతర కనెక్షన్లు 11.10 శాతంగా ఉన్నాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ 100 చదరపు కిలోమీటర్లకు 99.29 కి.మీ రహదారి సౌకర్యం ఉండగా జిల్లాలో ఇది 61 కి.మీ.గానే ఉంది. రోడ్డు కనెక్టివిటీ విషయంలో జిల్లా పరిస్థితి మెరుగుపడాల్సిన అవసరం ఉంది.
- వామపక్ష ప్రభావిత నిధుల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 17.7 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం పూర్తయింది.
- కొత్తగూడెం ఎయిర్‌పోర్టు కోసం రామవరం వద్ద 950 ఎకరాలు గుర్తించామని, ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫీజుబిలిటీ, అబిస్టికల్ లిమిటేషన్ సర్వేలు జరిగాయని, పూర్తి స్థాయి నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని నివేదికలో పేర్కొన్నారు.
- జిల్లా జనాభా, అర్బన్, రూరల్ పాపులేషన్, లింగ నిష్పత్తి తదితర వివరాలన్నీ 2011 జనాభా లెక్కలకు సంబంధించిన పాత వివరాలే ప్రస్తుత రిపోర్టులోనూ ఉన్నాయి.

'పది' పరీక్షలకు 10 కి.మీ.

- పరీక్షల వేళ బస్సులు లేక విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలే శరణ్యం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న తల్లిదండ్రులు



ములకలపల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం

కొత్తగూడెంఅర్బన్/ములకలపల్లి : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణ పాట్లు తప్పేలా లేవు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆర్టీసీ బస్సులు సకాలంలో అందుబాటులో ఉంటాయని అధికారులు ప్రకటించినా.. కార్యరూపం దాల్చడం లేదు. కొన్ని మారుమూల గ్రామాల వారు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే 10 నుంచి 15 కి.మీ.ప్రయాణించాలి. అయితే ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలు, ఇతర వాహనాలకు డబ్బు చెల్లించలేని వారికి కాలినడకే శరణ్యం. అదే ఆర్టీసీ బస్సులు నడిపిస్తే బాలురు తక్కువ చార్జీతో, బాలికలు ఉచితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

జగన్నాథపురానికి కేటాయిస్తే..
ములకలపల్లిలోనే రెండు కేంద్రాలు కాకుండా ఒకటి జగన్నాథపురం హైస్కూల్‌లో ఏర్పాటుచేస్తే అక్కడి 25 మందికి సౌకర్యంతో పాటు కమలాపురం పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు కూడా ఏడు కి.మీ.లోపే ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. వచ్చే ఏడాదైనా దీనిపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

పాల్వంచరూరల్ :పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు నడకయాతన తప్పేలా లేదు. మండల పరిధిలోని కిన్నెరసాని డ్యామ్ సైట్ పరీక్ష కేంద్రానికి యానంబైల్ ఉన్నత పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. పాండురంగాపురం నుంచి 29 మంది విద్యార్థులు బూర్గంపాడు మండలం ఉప్పుసాకకు వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తోంది. ఆయా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రజావాణిలో విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు.

బస్సులు నడపాలని కోరాం
పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలని డీఈఓ ఆర్టీసీ అధికారులను కోరారు. మారుమూల గ్రామాల విద్యార్థులు పరీక్ష సమయానికి కొంత ముందుగానే ఇంటినుంచి బయలుదేరి సకాలంలో కేంద్రాల వద్దకు చేరుకోవాలి. పరీక్ష సమయంలో ఆర్టీసీ అధికారులు కూడా చొరవ తీసుకుని విద్యార్థుల కోసం బస్సులు నడపాలి.
– మాధవరావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి

మండలాల్లో పరిస్థితి ఇలా..
- ములకలపల్లి మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. మండలంలో ఏడు ప్రభుత్వ, ఒక ప్రైవేటు పాఠశాల ఉండగా మొత్తం 249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో ములకలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 130 మందికి, గురుకుల పాఠశాలలో 119 మందికి కేంద్రాలుగా కేటాయించారు. మండలంలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన 30 మంది, జగన్నాథపురం ఉన్నత పాఠశాలకు చెందిన 25 మంది, పూసుగూడెం పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు పది కిలోమీటర్లు, పాగళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన 46 మంది విద్యార్థులు 13 కి.మీ. ప్రయాణించి మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. కాగా కమలాపురం, పాగళ్లపల్లి గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్సు సౌకర్యమే లేదు. జగన్నాథపురం, పూసుగూడెం గ్రామాలకు బస్సు ఉన్నా ఉదయం వేళ రాదు. దీంతో ఆ పాఠశాలల వారికీ ప్రైవేటు వాహనాలే శరణ్యం.
- లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక, మైలారం ప్రాంతాల నుంచి రేగళ్ల లేదా కొత్తగూడెం వచ్చి పరీక్ష రాయాల్సి ఉండగా వారు 15 కి.మీ. మేర ప్రయాణించాల్సి ఉంటుంది.
- అశ్వారావుపేట, అశ్వాపురం, టేకులపల్లి మండలాల్లోనూ కొన్నిచోట్ల ఇదే సమస్య ఎదురవుతోంది.

ఎస్సెస్సీ విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్‌కు మైలురాయి వంటివని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. ప్రణాళికాయుతంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.

40 రోజుల్లో రూ.కోటి ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

భద్రాద్రి రామాలయంలో హుండీల లెక్కింపు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 40 రోజుల్లో రూ. కోటికి పైగా ఆదాయం సమకూరింది. హుండీలను గురువారం లెక్కించగా రూ.1,14,60,041 నగదుతో పాటు 133 గ్రాముల బంగారం, 1,262 గ్రాముల వెండి లభ్యమయ్యాయి. ఇంకా ఇతర దేశాల కరెన్సీ కూడా లభించినట్లు ఈఓ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, సీసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

పదో తరగతి విద్యార్థులకు పీఓ సూచన



సుజాతనగర్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ రాహుల్

సుజాతనగర్ : పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ప్రతీ విద్యార్థి 10/10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. మండలంలోని సర్వారం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి షటిల్ బ్యాడ్మింటన్ ఆడిన అనంతరం పదో తరగతి వారికి హాల్ టికెట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థుల జీవితానికి ఈ పరీక్షలు మైలురాయి వంటివని చెప్పారు. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తేనే విజయం సాధిస్తారని, దీంతో పాటు ప్రణాళికాయుతంగా చదువుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించి ఐటీడీఏకు మంచి పేరు తేవాలని సంబంధిత అధికారులను కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ జనరల్ డేవిడ్‌రాజ్, ఏటీడీఓ చంద్రమోహన్, క్రీడల అధికారి గోపాలరావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పరిధిలో 2,665 మంది..
భద్రాచలంటౌన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 2,665 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని పీఓ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బాలురు1,423 మంది, బాలికలు 1,242 మంది ఉన్నారని, వీరంతా 55 ఆశ్రమ పాఠశాలలు, 21 వసతిగృహాలు, మూడు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, 79 ఇతర పాఠశాలల్లో చదువుతున్నారని వివరించారు. ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని పీఓ ఆకాంక్షించారు.

భద్రాద్రి రామయ్యపై శీతకన్నే!

- తాజా బడ్జెట్‌లో యాదాద్రి, వేములవాడకు రూ.వందల కోట్లు
- భద్రాచలానికి మాత్రం మొండిచేయి..
- డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ఎప్పుడో ?



భద్రాచలం పట్టణ వ్యూ

భద్రాచలం: ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా భద్రాచలం పట్టణం, రామాలయ అభివృద్ధికి మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. ప్రతీ బడ్జెట్ సమయంలో భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్నా.. వారికి నిరాశే మిగులుతోంది. తాజా బడ్జెట్‌లో యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.100 కోట్లు ప్రకటించి.. భద్రాచలానికి గుండుసున్నా చూపించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'భద్రాచలం టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

రామదాసు కాలం నాటిదే..
యాదాద్రి, వేములవాడలకు డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటుచేసిన ప్రభుత్వం..ప్రతీ బడ్జెట్‌లో నిధులు కేటాయించి భక్తులకు, స్థానికులకు అవసరమైన వసతులు కల్పిస్తోంది. కానీ భద్రాచలం రామాలయానికి, పట్టణాభివృద్ధికి ఎలాంటి అథారిటీ లేదు. ఎప్పుడో భక్త రామదాసు నిర్మించిన ఆలయానికి కొద్దిపాటి మార్పులు, చేర్పులు, సీతారాముల కల్యాణానికి నిర్మించిన మిథిలా స్టేడియం తప్ప ఇతర అభివృద్ధి పనులేవీ జరగలేదు. కల్యాణానికి ప్రతీ ఏడాది భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో మిథిలా స్టేడియాన్ని ఆధునాతనంగా పునఃనిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంలో రెండుమార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో అడుగు ముందుకు పడడం లేదు. ఆలయం పక్కన మాఢ వీధుల విస్తరణకు రెవెన్యూ అధికారులు ఇటీవల భూ సేకరణ చేసి నష్టపరిహారం ఇవ్వాలని నిర్ణయించినా దానికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇక రామాలయ హుండీ ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, ఉత్సవాల నిర్వహణకే సరిపోతుండగా భక్తులకు వసతుల సమస్య అపరిష్కృతంగానే ఉంటోంది.

ఇప్పటికీ వెనుకబాటే..
భద్రాచలం పట్టణం అభివృద్ధిలో ఇప్పటికీ వెనుకబడే ఉంది. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న భద్రాచలంలోని దాదాపు 25 కాలనీల్లో లక్ష వరకు జనాభా నివసిస్తున్నారు. దీన్ని మున్సిపాలిటీ చేయాలని ప్రభుత్వం యోచించినా ఏజెన్సీ చట్టాల కారణంగా న్యాయపరంగా సాధ్యం కావడం లేదు. అయితే జనాభాకు తగినట్లుగా వసతుల కల్పనలో మాత్రం ప్రభుత్వం విఫలమవుతోంది.

అన్ని విభాగాలను సమన్వయం చేస్తేనే..
భద్రాచలం అభివద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి ప్రకటనలు చేసిందే తప్ప రూపాయి కూడా మంజూరు చేయలేదు. వరదల సందర్భంగా రూ. 1,000 కోట్లు ప్రకటించినా అందులోనూ పైసా రాలేదు. అయితే ఆ స్థాయిలో నిధులు మంజూరైనా ఇక్కడ పనులు చేపట్టడం అంత తేలికైన అంశం కాదు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో స్థల సమస్య తీవ్రంగా మారింది. ఇక్కడ కీలకమైన దేవాదాయ, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవీశాఖ, ఐటీడీఏ, పోలీస్, పర్యాటక విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు సాధ్యమని, లేదంటే తేనెతుట్టెను కదిల్చినట్టేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక విభాగం పనులు ప్రారంభిస్తే మరో విభాగం అడ్డుకునే పరిస్థితుల నేపథ్యంలో అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అథారిటీ ఎందుకంటే..
ఒక ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలంటే సాధారణ పద్ధతులు సరిపోవు. అందుకే ప్రభుత్వాలు ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేస్తుంటాయి. ఇటీవల ఖమ్మం నగరాభివృద్ధికి స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఎప్పటినుంచో పని చేస్తోంది. టెంపుల్ టౌన్‌గా ఉన్న భద్రాచలం అభివృద్ధికి కూడా ఈ తరహా ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కీటక జనిత వ్యాధులపై అవగాహన

దుమ్ముగూడెం : కీటక జనిత వ్యాధులపై వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య బృందం అవగాహన కల్పించింది. మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మలేరియా–ఫైలేరియా బృందం గురువారం సందర్శించింది. వైద్యాధికారి, సిబ్బందితో మలేరియా, డెంగీ కేసులపై బృందం సభ్యులు చర్చించారు. రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మలేరియా కేసు నమోదైన పులిగుండాల గ్రామాన్ని సందర్శించారు. బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అందరూ దోమతెరలు కట్టుకోవాలని చెప్పారు. వైద్యాధికారులు కుమార్ స్వామి, రేణుకారెడ్డి, ధర్మారావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, మురళి, సురేష్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజేంద్రనాయక్

ములకలపల్లి: మండల పరిధిలోని ఎస్‌బీఐ పూసుగూడెం శాఖ మేనేజర్ బి.రాజేంద్రనాయక్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఉత్తమ బ్యాంకింగ్‌తోపాటు ఎక్సలెంట్ పెర్ఫార్మెన్స్‌కు గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజీఎం రాజేశ్‌కుమార్ అవార్డు అందజేశారు.

డీర్ పార్కు మహిళా వాచర్‌పై దాడి

పాల్వంచరూరల్: ఇంట్లో ఉన్న కిన్నెరసాని డీర్ పార్కులో వాచర్‌గా పనిచేస్తున్న మహిళపై దాడి ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన గుంటుపల్లి జ్యోతి ఈ నెల 14న తన ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన సీహెచ్.శివ వచ్చి గొడవ పడి దాడి చేశాడు. గాయపరిచి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

మణుగూరు టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసే వ్యక్తి వసూలు చేసిన రూ.90వేల నగదుతో ఉడాయించాడు. గురువారం బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు చేయగా మణుగూరు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిమాండ్ ఖైదీ మృతి

భద్రాచలంఅర్బన్: గంజాయి కేసులో పట్టుబడిన భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ధనసరి మల్లేష్ అలియాస్ పోడియం మల్లేష్‌ను 2021లో రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తీసుకెళ్లారు. ఈ ఏడాది జనవరి 22న అతని ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో గాంధీ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 19న మృతి చెందాడు. బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే 70958 88604నంబర్‌లో 24 గంటల లోపు సంప్రదించాలని చంచల్‌గూడ జైలర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగు టన్నుల చేపలు మృతి


మృతి చెందిన చేపలు

పాల్వంచరూరల్: చేపలు పట్టకుండా అడ్డుకోవడంతో నాలుగు టన్నుల చేపలు మృతిచెందాయని బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పన్నాల శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామ శివారులో అన్ని అనుమతులతో చెరువు నిర్మించి చేపలు పెంచుకుంటున్నాడు. ఈ నెల 18న చేపలు పడుతుంటే పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, శరత్ చంద్రారెడ్డి తమ అనుచరులు 15మందితో కలిసి వచ్చి చేపలు పట్టకుండా అడ్డుకున్నారు. చేపల లారీని కూడా అడ్డుకుని చంపుతామని బెదిరించారు. దీంతో రూ.2.80 లక్షల విలువైన నాలుగు టన్నుల చేపలు మృతిచెందాయని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పన్నాల శ్రీనివాసరెడ్డి తెలిపాడు.

పశువులు స్వాధీనం

పాల్వంచ: అక్రమంగా లారీలో తరలిస్తున్న పశువులను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బూర్గంపాడు నుంచి హైదరాబాద్‌కు లారీలో తరలిస్తుండగా ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో నవభారత్ సమీపంలో పట్టుకున్నారు. 36 పశువులను స్వాధీనం చేసుకుని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

పర్యావరణ స్పృహ పెంచేలా..

విద్యార్థులతో యూత్ ఎకో క్లబ్‌ల ఏర్పాటు

- బాల్య దశ నుంచే మొక్కలు, జల సంరక్షణపై అవగాహన
- ప్రభుత్వ పాఠశాలల్లో ఔషధ, పూల మొక్కల పెంపకానికి చర్యలు
- ఉమ్మడి జిల్లాలోని స్కూళ్లకు రూ.79.57 లక్షలు విడుదల


జగన్నాథపురం హైస్కూల్‌లో మొక్కలకు నీళ్లు పోస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటైన యూత్ ఎకో క్లబ్ కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్రీయ సప్తాహ్ ఆవిష్కార్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 2024–2025 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రూ.3 వేల చొప్పున, ప్రాథమికోన్నత, హైస్కూళ్లకు రూ.5 వేల చొప్పున నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిధుల వినియోగం ఇలా

ఉమ్మడి జిల్లాకు రూ.79.57 లక్షలు విడుదలయ్యాయి. వీటితో ప్రభుత్వ పాఠశాలల్లో ఔషధ మొక్కలు కరక్కాయ, విప్ప, తిప్పతీగ, కలబంద, రణపాల వంటి మొక్కలు పెంచుతారు. టాల్ ప్లాంటేషన్‌లో ఉసిరి, పనస, మునగ, చింత, కరివేపాకు, కానుగ, మోదుగు, పశువుల దాణాకు ఉపయోపడే అజోల్లా, కిచెన్ గార్డెన్‌లో ఆకుకూరలు, కూరగాయల మొక్కలు, వివిధ రకాల పూలతోటలను పెంచాల్సి ఉంటుంది. స్కూల్ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు నిర్మించి వాన నీటి సంరక్షణతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

భద్రాద్రి జిల్లాలో 1,057 పాఠశాలలకు..

భద్రాద్రి జిల్లాలో 782 ప్రాథమిక పాఠశాలలకు రూ.23.46 లక్షలు, 159 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.7.95 లక్షలు, 101 హైస్కూళ్లకు రూ.5.5లక్షలు, 15 సెకండరీ హైస్కూళ్లకు రూ.75 వేలు.. మొత్తంరూ.37.25 లక్షలు మంజూరు చేశారు.

ఖమ్మం జిల్లాలో 1,148 పాఠశాలలకు..

ఖమ్మం జిల్లాలోని 752 ప్రాథమిక పాఠశాలలకు రూ.22.56 లక్షలు, 187 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.9.35 లక్షలు, 194 హైస్కూళ్లకు రూ.9.70 లక్షలు, 15 సెకండరీ హైస్కూళ్లకు రూ.75 వేలు మంజూరు చేశారు. పర్యావరణ, జలసంరక్షణ నిర్వహణలో ఉత్తమ యూత్ ఎకో క్లబ్‌లను ఎంపిక చేసి కలెక్టర్ ప్రశంసా పురస్కారాలు కూడా అందజేస్తారు.

వేసవి సెలవుల్లో విత్తన సేకరణ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వేసవి సెలవుల్లో ఔషధ మొక్కలు, స్కూల్ గార్డెన్ మొక్కలు, పూలతోటల మొక్కలకు సంబంధించిన విత్తనాలను సేకరించాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్‌లో ఆయా పాఠశాలల ఆవరణల్లో నర్సరీలో ఏర్పాటు చేసి మొక్కలు పెంచి, అనంతరం నాటి సంరక్షించాల్సి ఉంటుంది.

ప్రోత్సాహకాలు అందిస్తాం

పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రాస్ కార్యక్రమం అమలు చేస్తోంది. ఎకో క్లబ్‌లను విజయవంతంగా నిర్వహించే పాఠశాలలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో ప్రోత్సాహకాలు అందించనున్నారు. జిల్లాస్థాయిలో రూ. 50 వేలు, మండల స్థాయిలో రూ.5 వేలు, కాంప్లెక్స్ స్థాయిలో రూ.1000 చొప్పున నగదు అందజేస్తాం. ఈ నిధులతో విత్తన సేకరణతోపాటు టబ్బులు, పలుగు, పార కొనుగోలు చేసుకోవచ్చు. జల సంరక్షణకు ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతలు నిర్మించాలి.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ.

నాగుపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సాయికిషోర్ రెడ్డి

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలో గురువారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పోలీసులు గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సోదాలు చేశారు. వాహనాలకు సరైన ధ్రువ పత్రాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. అనంతరం ఎస్సై సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. గ్రామంలో అనుమానాస్పద రీతిలో ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి, అదనపు ఎస్సై బాలస్వామి, అశ్వారావుపేట ఎస్సైలు యయాతి రాజు, రామ్మూర్తి, ఎక్సైజ్ ట్రైనీ ఎస్సైఅఖిల, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా ముసుగు తొలగలే !


బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ముసుగు వేసి ఉన్న ఎన్టీఆర్ విగ్రహం

బూర్గంపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు మాత్రం ఇంకా తొలగలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గత నెల 3న నోటిఫికేషన్ విడుదలైంది. నాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లోని రాజకీయ పార్టీల దివంగత నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. గత నెల 27న ఎన్నికలు నిర్వహించి ఈ నెల 3న ఫలితాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసి 20 రోజులు గడుస్తున్నా విగ్రహాలకు వేసిన ముసుగులను మాత్రం అధికారులు తొలగించలేదు. సంబంధిత రాజకీయ పార్టీల నాయకులు కూడా తమ నాయకుడి విగ్రహానికి వేసిన ముసుగులు తొలగించకపోవటం గమనార్హం.

సరిహద్దులో భారీగా ట్రాఫిక్ జామ్

ఏపీలో ఆందోళనతో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై గురువారం గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం తాటాకులగూడేనికి చెందిన గంధం బోసుబాబు అనే వ్యక్తిపై ఈ నెల 18న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తరలించగా గ్రామస్తులు, బంధువులు జీలుగుమిల్లి వద్ద జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దాడిచేసిన వారిని పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా ఆందోళన కార్యక్రమంతో ఏపీ నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఏపీ వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సరిహద్దు చెక్ పోస్టు నుంచి దమ్మపేట మండలం మందలపల్లి వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో దాదాపు మూడు గంటలపాటు వాహనాలు రోడ్డుపై ఆగిపోయింది. దాదాపు మూడు గంటల తర్వాత రాత్రి 8 గంటల సమయంలో జీలుగుమిల్లిలో ఆందోళన విరమించడంతో వాహనాలు కదిలాయి.

ఎస్సై చొరవతో మహిళకు ఊరట

వేరే ఖాతాకు బదిలీ అయిన నగదు తిరిగి అందజేత


జుగుణమ్మకు నగదు అందజేస్తున్న ఎస్సై రాజేందర్

కరకగూడెం: మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన ఆవుల జుగుణమ్మ తాను పనికి వెళ్లిన చోట నుంచి ఇటీవల రూ. 28,000 ఫోన్ పే ద్వారా తన నంబర్‌కు పంపించుకుంది. మరుసటి రోజు నగదు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో నగదు జమ కాలేదని అధికారులు తెలిపారు. జుగుణమ్మ ఫోన్ నంబర్ బ్లాక్ అవ్వడంతో, అదే నంబర్ వేరే వాళ్లు తీసుకుని ఫోన్ పేకు లింక్ చేసుకున్నారు. దీంతో నగదు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలానికి చెందిన ఓ మహిళ ఖాతాలో జమైంది. పలుమార్లు బ్యాంకు చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు రోజుల క్రితం కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై రాజేందర్‌కు తన గోడు వెళ్లబోసుకుంది. దీంతో ఎస్సై స్పందించి ఓ కానిస్టేబుల్‌ను అక్కడికి పంపి సదరు ఖాతాదారురాలి అకౌంట్ నుంచి నగదు డ్రా చేయించి తెప్పించారు. గురువారం స్టేషన్‌లో బాధితురాలికి నగదు అప్పగించారు. దీంతో జుగుణమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. రైటర్ దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కూసుమంచి: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గంగబండ తండాకు చెందిన బానోత్ ఉపేందర్(25) ఈనెల 14న రాత్రి పురుగుల మందు తాగగా ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, అనారోగ్య కారణాలతో ఉపేందర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తండ్రి కోటియా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు రామాలయ ఉద్యోగులు సరెండర్

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులను దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓ ఎల్.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ శివరామ్ విధుల్లో చేరిన రెండో రోజు నుంచే సక్రమంగా హాజరు కావడంలేదని పేర్కొన్నారు. మరో జూనియర్ అసిస్టెంట్ ఆగారెడ్డి ఏ విభాగంలో విధులు కేటాయించిన సక్రమంగా నిర్వహించకుండా తరుచు మద్యం తాగి సహచర మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. పలు మార్లు హెచ్చరించిన మార్పు రాకపోవడంతో ఇద్దరిపై చర్యలు తీసుకోవడంతోపాటు కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు వివరించారు.

విద్యుత్ శాఖలో ఎమర్జెన్సీ బృందాలు

- ఆరుగురు చొప్పున ఐదు బృందాల ఏర్పాటు
- జీపీఆర్‌ఎస్ లొకేషన్ ఆధారంగా పయనం, సమస్యల పరిష్కారం


వాహనంలో సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధించి సేవలను యుద్ధ ప్రాతిపదికన అందించేలా ఎమర్జెన్సీ రిస్టోర్ టీం(ఈఆర్‌టీ)లను ఏర్పాటు చేస్తున్నారు. వేసవిలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తరచుగా విద్యుత్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేలా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక బృందాలను నియమిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఐదు వాహనాలను కేటాయించారు. ఈ వాహనాల ఆధారంగా ఖమ్మం సర్కిల్‌లో ఐదు ఈఆర్‌టీలను ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించారు. ఖమ్మం సర్కిల్‌లో ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో ఖమ్మం, వైరా డివిజన్లలో ఐదు బృందాలను నియమించారు.

సమాచారం అందగానే...

ఎక్కడైనా విద్యుత్ సంబంధిత సమస్య ఎదురైనట్లు స్థానికులు ఫిర్యాదు చేసినా లేదా ట్రోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా సమాచారం అందినా ఈఆర్‌టీ బృందం వెంటనే రంగంలోకి దిగుతుంది. ఈ సేవలకు జీపీఆర్‌ఎస్‌ను వినియోగించుకుంటున్నారు. స్థానికులు, విద్యుత్ సిబ్బంది సమస్య ఉన్న ప్రాంతం జీపీఆర్‌ఎస్ లొకేషన్ పెడితే ఈఆర్‌టీలు వాహనంలో బయలుదేరతారు. ఈ యాన వాహనంలో థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్ కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం ఈ సేవలను ఎన్పీడీసీఎల్ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినా 24గంటల అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కాగా, సర్కిల్ పరిధిలో వేసవి ప్రణాళికలో భాగంగా మరిన్ని ఈఆర్‌టీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

సత్వర సేవల కోసం...



వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ఈఆర్‌టీలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలకు అవసరమైన వాహనాలు, సామగ్రిని సమకూర్చాం. సాంకేతిక పరిజ్ఞాం ద్వారా సమస్య ఎదురైన ప్రాంతాన్ని గుర్తించి ఆయా బృందాలు చేరుకుంటాయి.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్‌ఈ

దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన అధికారులు


నష్టంపై ఆరా తీస్తున్న అధికారుల బృందం

రఘునాథపాలెం: మండలంలోని బావోజీతండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటలను నాలుగు శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాసచార్యులు, డీఈ రామారావు, ఏడీ సంజీవ్‌కుమార్, ఏఈ సతీష్, వ్యవసాయశాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి నగేష్, ఆర్‌ఐలు సత్యనారాయణ, ప్రవీణ్ బాధిత రైతులతో మాట్లాడారు. ఈమేరకు బానోత్ పార్వతి, ప్రమీలకు చెందిన తొమ్మిది ఎకరాల తోటకు నష్టం జరిగిందని చెప్పగా, ఆయిల్‌పామ్, శ్రీగంధం చెట్లతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పైపులు కూడా కాలిపోయాయని వివరించారు. తోటలపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు వాపోయారు. కాగా, నష్టం వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఉద్యాన శాఖ అధికారి నగేష్ తెలిపారు.

పురుగు మందుకు బదులు గడ్డి మందు పిచికారీ

ఐదెకరాల్లో మాడిపోయిన వరి పంట


ఎండిపోయిన పంట

నేలకొండపల్లి: ఆరుగాలం కష్టపడి, అందిన దగ్గరల్లా అప్పులు తెచ్చి సాగుచేసిన వరి పంట చేతికందే సమయాన నిలువెల్లా మాడిపోయింది. పురుగుల నివారణ మందుకు బదులు గడ్డి నివారణ మందు పిచికారీ చేయడంతో ఈ పరిస్థితి ఎదురు కాగా రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన గంజికుంటల చిన్న సంగయ్య ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. పంటకు మెడ విరుపు తెగులు సోకడంతో నివారణ మందుకు బదులు ఆయన గడ్డి నివారణ మందు పిచికారీ చేశాడు. దీంతో పంట మొత్తం ఎండిపోవడంతో రూ.2లక్షల మేర పెట్టుబడి, పంట చేతికొస్తే అందే రూ.4లక్షల ఆదాయం కోల్పోయినట్లేనని కన్నీరుమున్నీరవుతున్నాడు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వ్యవసాయ కూలీ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఓ వ్యవసాయ కూలీ రూ. 85 వేలు నష్టపోయిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగుచేసింది. ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన నూర్ మహ్మద్ వ్యవసాయ కూలిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 11న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తమ ట్రస్టు ద్వారా పేదలకు ఆర్థిక రుణాలు అందిస్తున్నట్లు నమ్మించాడు. డాక్యుమెంటేషన్ చార్జీలు రూ. 5 వేలు చెల్లించాలని కోరగా బాధితుడు ఫోన్ పే చేశాడు. ఇలా వారం రోజుల్లో రూ. 85 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అప్పులు చేసి ఆ సొమ్మంతా చెల్లించాడు. చివరకు మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచ: భూమి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాక దౌర్జన్యం చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నవభారత్‌లో రమాదేవి అనే మహిళ శ్రీరామినేని విజయలక్ష్మి, హనుమంతరావు వద్ద కొన్నేళ్ల క్రితం భూమి కొనుగోలు చేసింది. అనంతరం భూమి మీదకు వెళ్లకుండా అడ్డుకుంటుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి, హనుమంతరావు, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

బెల్ట్ షాప్ విక్రయంలో వివాదం

గడ్డిమందు తాగి ఆత్మహత్య

మణుగూరు టౌన్: బెల్ట్ దుకాణం విక్రయంలో గొడవ జరగడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మణుగూరులో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు మండలంలోని అశోక్‌నగర్‌కి చెందిన నవీన్‌కుమార్(44) తన బెల్ట్ దుకాణాన్ని సిద్దు అనే వ్యక్తికి ఆ దుకాణం విక్రయించాడు. కొంతకాలం నడిపాక తనకు దుకాణం వద్దని, డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి బెదిరించసాగాడు. దీంతో మనస్తాపం చెందిన నవీన్ బుధవారం మధ్యాహ్నం సెల్ఫీ వీడియో తీస్తూ గడ్డిమందు తాగాడు. భద్రాచలంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్ : చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ.9 లక్షలు చెల్లించాలని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ గురువారం తీర్పు వెలువరించారు. చర్లకు చెందిన కోటేరు శ్రీనివాసరెడ్డి భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన రామాచారి వద్ద 2015లో వ్యాపార నిమిత్తం రూ.9 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హామి కింద చెక్కును బ్యాంక్‌లో జమ చేయగా బౌన్స్ అయింది. దీంతో శ్రీనివాసరెడ్డి భద్రాచలం కోర్టులో కేసు దాఖలు చేశాడు. విచారణ జరిపిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

13 ఇసుక ట్రాక్టర్లు సీజ్

మణుగూరు టౌన్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 13 ఇసుక ట్రాక్టర్లను మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి గురువారం పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్టీఏ, పోలీస్, రెవెన్యూ శాఖల నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా తరలించొద్దని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని బర్లపెంట ఏరియాకు చెందిన ఆరుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నంబర్–2 బస్తీకి చెందిన 25 ఏళ్ల దళిత యువతి కె.వినీల కొత్తగూడెం జీజీహెచ్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా ట్రైనింగ్ చేస్తోంది. ఈ క్రమంలో ఇల్లెందు నంబర్–2 బస్తీ బర్లపెంటకు చెందిన యువకుడు ఏ.సాయిశివతో పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారగా, 2023 మార్చి 3న భద్రాచలం గుడిలో వివాహం చేసుకున్నారు. ఖమ్మంలో కాపురం పెట్టారు. కొంతకాలం తర్వాత భర్త, అత్త, మామ, బావ, అతని భార్య, ఆడపడుచులు వేధిస్తూ తీవ్ర ఇక్కట్లు పెడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

యువర్స్



• ఆర్ట్ అండ్ కల్చర్

రోహిట్

చిన్నప్పటి నుంచి టీవీల్లో డ్యాన్స్ షోలు చూస్తూ డాన్సర్ కావాలనుకునేవాడు రోహిత్ సరాఫ్. వెండితెరపై కుమారుడిని చూడాలని కలలు కనేవాడు అతడి తండ్రి. అయితే తన కల నెరవేరే భాగ్యాన్ని చూడలేదు. రోహిత్ పన్నెండేళ్ల ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు.

'నాన్న ఆత్మకు శాంతి చేకూరాలంటే నేను నటుడిని కావాల్సిందే' అని బలంగా డిసైడైపోయాడు రోహిత్.

ఢిల్లీ నుంచి ముంబైకి వచ్చిన సరాఫ్ ఒక టీవీ చానల్ యూత్ షోకు హాజరయ్యాడు.

కెమెరా ముందుకు రావడం కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది.

'బాగా కష్టపడితేగానీ ఇక్కడ నెగ్గుకు రాలేం' అనుకున్నాడు. మొదటి సంవత్సరం రెండు టీవీ షోలలో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాత యాడ్స్‌లో, ఒక సినిమాలో అవకాశం వచ్చింది.

అయితే...తొలి సినిమా షూట్ చేసిన రెండున్నరేళ్ల తరువాత అది ఆగిపోయిందని తెలుసుకున్నాడు. బాగా నిరాశకు గురయ్యాడు. ఆడిషన్స్‌కు కూడా వెళ్లేవాడు కాదు. దీంతో ఎవరి నుంచి పిలుపు వచ్చేది కాదు.

మరోవైపు ఆర్థిక ఇబ్బందులు. ఆ చీకటి రోజులలో 'ఇలా అయితే ఎలా?' అని తనకు తానే ప్రశ్న వేసుకున్నాడు. మళ్లీ కష్టపడాలని గట్టిగా అనుకున్నాడు. 'ప్రతిరోజూ కొండంత ధైర్యంతో, కోటి కలలతో నిద్ర లేవాలి అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

డియర్ జిందగీ, హిచ్కీ, ది స్కై ఈజ్ పింక్‌లాంటి చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. 'యస్...నాకు భవిష్యత్తు ఉంది' అనే ఆశాకిరణం ఉజ్వలంగా మెరిసింది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'మిస్‌మ్యాచ్‌డ్' తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ప్రస్తుతం మణిరత్నం-కమల్‌హాసన్ సినిమాలో, ధర్మ ప్రొడక్షన్‌లాంటి పెద్ద సంస్థ సినిమాలో నటిస్తున్నాడు. 'కలలు అనేవి పిరికి వాళ్ల కోసం కాదు. ధైర్యంగా ఉండే వ్యక్తుల కోసమే' అంటున్న 28 సంవత్సరాల రోహిత్ సరాఫ్ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు సాధించాడు.

ఏకాగ్రత పెరుగుతుంది

చదువు అనేది మహా సముద్రం లాంటిది. మనం నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి' క్లాసురూమ్‌లో విన్న ఇలాంటి మాటలు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు నేర్చుకునేలా చేసింది. కొత్త కోర్సులు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఐఏఎస్ చేయాలనేది నా లక్ష్యం.

- బి. ప్రవల్లిక

175 ఆన్‌లైన్ కోర్సులు
నాన్‌స్టాప్ లెర్నర్



పది విషయాలు నేర్చుకున్నప్పుడు కూడా... నేర్చుకోవడానికి మరో పది విషయాలు రెడీగా ఉంటాయి. 'నేర్చుకోవడానికి నేను రెడీ' అనుకుంటే మీరే విజేత. అలాంటి ఒక విజేత... బి. ప్రవల్లిక. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 175 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి 'ఔరా' అనిపించింది...

విశాఖ జిల్లా భీమిలిలోని 'కస్తూర్బా గాంధీ విద్యాలయం'లో పదవ తరగతి చదువుతున్న బి. ప్రవల్లిక చదువులో ముందుండడమే కాకుండా పలు కోర్సులలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ప్రవల్లిక తండ్రి కోవిడ్ వల్ల చనిపోయారు. తల్లి ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది.



ఆన్‌లైన్ కోర్సుల హవా...

గతంలో సమగ్ర శిక్ష అభియాన్‌ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పని చేసిన బి.శ్రీనివాసరావు ఇక్కడి విద్యార్థినులు ఆధునిక కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ వారి సహకారాన్ని తీసుకున్నారు. కోర్సుల కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన సమాచారం, సూచనలు అందిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్, డ్రోన్... మొదలైన వాటితోపాటు మొత్తం 175 కోర్సులు పూర్తి చేసింది ప్రవల్లిక. కోర్సును బట్టి కొన్ని గంటలు లేదా ఒకటి, రెండు రోజుల్లో నేర్చుకుని పరీక్షల్లో పాల్గొంటూ మంచి మార్కులు పొందుతూ సర్టిఫికెట్లు సాధించింది.

నాడు... నేడు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'నాడు-నేడు' పనుల ద్వారా ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల ఆన్‌లైన్ కోర్సుల అభ్యసనకు వీలు కలిగింది. రూ. 51 లక్షలతో అదనపు గదులు, విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకోవడానికి పెద్ద షెడ్డు, అవసరమైన ఇతర సదుపాయాల కల్పన జరిగింది.

'ఆసక్తి ఉన్నచోటే ప్రతిభ ఉంటుంది. ప్రవల్లికకు కొత్త విషయాలపై ఎంతో ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెను 175 కోర్సులు పూర్తి చేసేలా చేసింది. భవిష్యత్తులో తన చదువుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 175 కోర్సులు పూర్తి చేయడం అనేది ఆమెకే కాదు విద్యాలయానికి గర్వకారణం' అంటుంది కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి.

టార్గెట్... ఐఏఎస్

ఎంతోమంది ఐఏఎస్ అధికారుల విజయగాథలను క్లాస్ రూమ్‌లో వింటున్నప్పుడు ప్రవల్లిక మదిలో 'ఐఏఎస్' కలకు బీజం పడింది. 'లక్ష్యసాధనకు మన ఆర్థిక స్థితిగతులతో పని లేదు. కడు పేదరికంలో పుట్టిన వారు కూడా ఎంతో కష్టపడి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. మనకు కావాల్సింది సాధించాలనే పట్టుదల మాత్రమే'... ఇలాంటి మాటలు ఎన్నో ప్రవల్లికకు స్ఫూర్తినిచ్చి 'ఐఏఎస్' లక్ష్యానికి బలాన్ని ఇచ్చాయి.

– సింగారెడ్డి రమణప్రసాద్, సాక్షి, భీమిలి

• టెక్... టాక్



షావోమీ 15 ఆల్ట్రా

డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 32ఎంపీ
బ్యాటరీ: 5410 ఎంఏహెచ్
రిజల్యూషన్: 1440X3200 పిక్సెల్స్



షావోమీ ప్యాడ్ 7 ప్రో

హైట్: 251.22 ఎంఎం ; విడ్త్:173.42 ఎంఎం
బరువు: 500 గ్రా. స్క్రీన్ సైజ్: 11.2
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
వోఎస్: షావోమీ హైపర్ వోఎస్ 2
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 8850 ఎంఏహెచ్
కలర్స్: గ్రే, బ్లూ, గ్రీన్

గెలాక్సీ ఏ సిరీస్

శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఏ సిరీస్ కోసం మూడు కొత్త డివైజ్‌లను యాడ్ చేసింది. అవి: గెలాక్సీ ఏ 56, గెలాక్సీ ఏ 36, గెలాక్సీ ఏ26. గెలాక్సీ ఏకు మరింత యాక్సెస్ చేసే లేటెస్ట్ మిడ్ రేంజ్ శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇవి.
గెలాక్సీ ఏ56
8జీబి ర్యామ్; 128 జీబి స్టోరేజ్
గెలాక్సీ ఏ 36 : 8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్



మెరుపు వీరుడు

• గేమింగ్



'కొండలు, కోనలు మనకి అడ్డంకి కాదు' అనుకునే సాహసికులకు స్వాగతం పలికే గేమ్ ఇది.

మిస్టీరియస్ పాయింట్స్‌ను అవగాహన చేసుకుంటూ అనుభవజ్ఞానాన్ని సొంతం చేసుకునే సాధకులకు దారి చూపే గేమ్ ఇది. గెరిల్లా యుద్ధంలో రాటు తేలిన యోధులకు వీర తిలకం దిద్దే గేమ్ ఇది. యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ అసాసిన్స్ క్రీడ్ షాడోస్ విడుదల అయింది. అసాసిన్స్ క్రీడ్ సిరీస్‌లో వస్తున్న 14వ మేజర్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. 16వ శతాబ్దంలో సెంగోకు కాలానికి చెందిన కథ నేపథ్యంలో రూపొందించిన ఈ గేమ్‌లో జపాన్ అంతర్యుద్ధ సంఘటనలు కనిపిస్తాయి. తన శక్తియుక్తులతో టకేడా వంశంపై విజయం సాధిస్తాడు ఓడా నోబునాగా. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధాలే కాదు నిలువెత్తు కోటలు, అలంకరించబడిన వాస్తు శిల్పాలు, సందడిగా ఉండే ఓడరేవులు... మొదలైనవి ఎన్నో ఈ ఆటలో కనిపిస్తాయి. రకరకాల మిషన్‌ల ద్వారా వివిధ క్యారెక్టర్‌లకు మారే అవకాశం ప్లేయర్స్‌కు ఉంటుంది. సరికొత్త ఫీచర్‌లతో ప్లేయర్స్‌కు సినిమాటిక్ ఫైటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

సిరీస్: అసాసిన్స్ క్రీడ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్/ మాక్ వోఎస్/ఐపాడ్ వోఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్

• ఇడియమ్స్

చ్యూ ద కడ్

ఒక విషయం లేదా సంఘటనకు సంబంధించి లోతుగా ఆలోచించడం, విశ్లేషించడానికి సంబంధించి వాడే మాట... చ్యూ ద కడ్. ఉదా: ఆఫ్టర్ దీ మీటింగ్, శ్రీను టుక్ టైమ్ టు చ్యూ ద కడ్ ఆన్ దెయిర్ న్యూ ప్రాజెక్ట్ ప్రపోజల్



ఫోమ్ ఎట్ ద మౌత్

తట్టుకోలేని కోపం, అసహనానికి గురయ్యే సందర్భంలో వాడే మాట... ఫోమ్ ఎట్ ద మౌత్.
ఉదా: ది సీయివో బిగెన్ టు ఫోమ్ ఎట్ ద మౌత్ వెన్ హీ డిస్కవర్డ్ ది ఫైనాల్షియల్ లాసెస్.

సాక్షి సినిమా

ధమ ధమ ధమ విశ్వలింగ...



• మోహన్ బాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'కన్నప్ప'లో మోహన్‌బాబు చేసిన మహదేవ శాస్త్రి పాత్ర పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. 'ధమ ధమ ధమ విశ్వలింగ... ధిమి ధిమి ధిమి విశ్వ లింగ....' అంటూ ఈ పాట సాగుతుంది. స్టీఫెన్ దేవస్సీ స్వరపరచిన ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్ ఆలపించారు.

నా హృదయం నిండిపోయింది

- చిరంజీవి



''హౌస్ ఆఫ్ కామన్స్-యుకె పార్లమెంట్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీలు, దౌత్యవేత్తలచే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది'' అని హీరో చిరంజీవి తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కళారంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన సేవలకుగానూ యుకె పార్లమెంట్ హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు ఎంపీలు, మంత్రుల చేతులమీదుగా ఈ నెల 19న(బుధవారం) చిరంజీవికి గౌరవ సత్కారం జరిగింది. అలాగే సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన యూకేకి చెందిన 'బ్రిడ్జి ఇండియా' అనే సంస్థ తొలిసారి అందించిన 'జీవిత సాఫల్య పురస్కారం' కూడా అందుకున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ–''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు, నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ థ్యాంక్స్. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది'' అన్నారు.



• శిరీష్, హర్షిత్, 'దిల్' రాజు, హనీఫ్, హర్షిత, సునీత

మల్టీస్టారర్‌కి శ్రీకారం

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'మార్కో' మూవీ చిత్ర దర్శకుడు హనీఫ్ అదేనితో ఓ మల్టీస్టారర్ మూవీకి శ్రీకారం చుట్టారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించనున్న ఈ కొత్త చిత్రాన్ని గురువారం ప్రకటించారు. ''మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో హై బడ్జెట్‌తో పాన్ ఇండియా మల్టీస్టారర్ ఫిల్మ్‌ని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురు ఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భాగ్యనగరం అంతా మనదే మనదే...



• వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

''ఈ పనిని ఇలానే ఎందుకు చేయాలి? మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటివాళ్లని క్రాక్ అంటుంటాం. 'జాక్: కొంచెం క్రాక్' రైమింగ్‌తో పాటు హీరో క్యారక్టరైజేషన్ కూడా ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టడానికి కారణం అయ్యింది. ఈ సినిమాలో ప్రేక్షకులను నవ్విస్తూనే, బాధ్యతగా ఉండే పాత్రలో కనిపిస్తాను'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కిస్' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. 'భాగ్యనగరం అంతా మనదే మనదే...' అంటూ ఈ 'కిస్' సాంగ్ సాగుతుంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్‌గారు చెప్పగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను. నేనూ ఓ రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను. భాస్కర్‌గారు ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు'' అన్నారు. ''సిద్ధు యూత్‌కి మాత్రమే కాదు అన్ని ఏజ్‌ల వారికీ స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ఈ చిత్రం పాటల రచయిత సనారె, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.

శారీ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు

- రామ్‌గోపాల్ వర్మ



• సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య, గిరి కృష్ణకమల్

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనీ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''రాజకీయాలు, సినిమాలు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో మా సినిమాకు థియేటర్స్ దొరకవని అనుకోవడం లేదు. ఏదైనా చట్ట ప్రకారమే జరుగుతుంది. పోసాని కృష్ణమురళిగారిని అరెస్ట్ చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా? తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియకపోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.

వినోదాల సింగిల్



• శ్రీవిష్ణు, కేతికా శర్మ

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న చిత్రం '#సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవాన, కేతికా శర్మ హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మే 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరించే చిత్రంగా 'సింగిల్' ఉంటుంది. ఈ వేసవిలో శ్రీవిష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ఆ ఉద్దేశంతోనే ఈ ఫంక్షన్‌కి వచ్చాను

- బ్రహ్మానందం



• ప్రియాంక, బ్రహ్మానందం, సప్తగిరి

''తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను'' అన్నారు బ్రహ్మానందం. సప్తగిరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ చిత్రంలో ప్రియాంకా శర్మ హీరోయిన్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ– ''ప్రేక్షకులను పది కాలాల పాటు నవ్వించాలని తపన పడేవాడు హాస్యనటుడు. హాస్య నటుడిది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. 'పెళ్లికాని ప్రసాద్' సినిమా కోసం సప్తగిరి చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాను హిట్ చేసి, హాస్య నటుడికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది'' అని మరో ముఖ్య అతిథి, దర్శక-నిర్మాత మారుతి తెలిపారు. ''ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు కేవై బాబు.

కోర్ట్ విజయం మాకు హెల్ప్ అవుతుంది

- రాహుల్ రెడ్డి



''కొత్తదనంతో కూడిన మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని నిర్మాతగా నా నమ్మకం. మంచి కంటెంట్‌తో రూపొందించిన మా 'టుక్ టుక్' విజయం పై నమ్మకం ఉంది'' అని రాహుల్ రెడ్డి అన్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ– ''దర్శకుడు సుప్రీత్‌తో కలిసి 'అలనాటి చిత్రాలు' అనే వెబ్ ఆంథాలజీ చేశాను. సుప్రీత్ చెప్పిన ఫ్యాంటసీ థ్రిల్లర్ కథ నచ్చడంతో 'టుక్ టుక్' నిర్మించాను. రెండున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే ఫిల్మ్ ఇది. రోషన్ నటించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమా సక్సెస్ మాకూ హెల్ప్ అవుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు.